

లంబసింగి ఘాట్‌లో రహదారికడ్డంగా పడిపోయిన వృక్షాన్ని ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న అధికారులు

లంబసింగి ఘాట్‌లో కూలిన భారీ వృక్షం

- ఐదు గంటల పాటు నిలిచిపోయిన రాకపోకలు
- సమాచారం అందిన వెంటనే స్పందించిన ఎస్ఐ, ఆర్అండ్‌బీ ఏఈ
- చెట్టు తొలగింపు
- రాకపోకలు పునరుద్ధరణ

చింతపల్లి, జూలై 22: నర్సీపట్నం-చింతపల్లి ప్రధాన రహదారిలోని లంబసింగి ఘాట్‌లో సోమవారం తెల్లవారుజామున భారీ వృక్షం కూలింది. దీంతో ఐదు గంటల పాటు ఇరువైపులా రాకపోకలు నిలిచిపోయాయి. మూడు రోజులుగా గిరిజన ప్రాంతంలో ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తుండడంతో సోమవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో బోడకొండమ్మ ఆలయానికి సమీపంలో భారీ వృక్షం రహదారికి అడ్డంగా పడింది. దీంతో నర్సీపట్నం నుంచి చింతపల్లి, సీలేరు, భద్రాచలం వెళ్లే ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు, చింతపల్లి, జీకేవీధి, సీలేరు నుంచి నర్సీపట్నం, విశాఖపట్నం, తుని వెళ్లే రాత్రి వేళ బస్సులు, ప్రైవేటు వాహనాలు ఘాట్‌లో నిలిచిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న చింతపల్లి ఎస్ఐ అరుణ్ కిరణ్, ఆర్అండ్‌బీ ఏఈఈ ఎంఎస్‌వీ ప్రసాద్ స్పందించి ఎక్స్‌కవేటర్‌ని లంబసింగి ఘాట్‌కి పంపించారు. ఉదయం తొమ్మిది గంటలకు ఏఎస్ఐ గెమ్మెలి సన్యాసిరావు, ఆర్అండ్‌బీ సిబ్బంది ఎక్స్‌కవేటర్‌తో రహదారికి అడ్డంగా పడిపోయిన వృక్ష శకలాలను తొలగించారు. అనంతరం ఇరువైపులా రాకపోకలు పునరుద్ధరించారు. దీంతో ఐదు గంటల పాటు వాహనాలు ఘాట్‌లో నిలిచిపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు.



లంబసింగి ఘాట్‌లో నిలిచిపోయిన వాహనాలు



పాడేరు-పెదబయలు మండలాల సరిహద్దులో పరదానిపుట్టు కాజ్‌వే కింద నుంచి ప్రవహిస్తున్న వరదనీరు

అల్పపీడనం, వాయుగుండంల ప్రభావంతో జిల్లాలో సోమవారం సైతం ముసురు కొనసాగింది. గత రెండు రోజులతో పోల్చితే వర్షం మోస్తరుగా కురుస్తుండడంతో గెడ్డల ఉధృతి కాస్తా తగ్గుముఖం పట్టింది. జిల్లా కేంద్రం పాడేరు మొదలుకుని జిల్లా వ్యాప్తంగా వాయుగుండం ప్రభావం కొనసాగుతున్నది. వర్షాలు తగ్గడంతో వంతెనలు, కాజ్‌వేల కింద నుంచి నీరు పారుతున్నది. పాడేరు మండలంలోని రాయిగెడ్డ కాజ్‌వే, పాడేరు, పెదబయలు మండలాలకు సరిహద్దున ఉన్న పరదానిపుట్టు కాజ్‌వే వద్ద సైతం కింద నుంచే వాన నీరు ప్రవహిస్తున్నది. అయితే ముసురు వాతావరణం కొనసాగుతుండడంతో జనజీవనానికి అంతరాయం ఏర్పడుతున్నది.



జీకేవీధి: విద్యుత్ తీగలపై పడిన చెట్టు కొమ్మలను తొలగిస్తున్న ఈపీడీసీఎల్ సిబ్బంది

వీడని ముసురు

- కొనసాగుతున్న వర్షాలు..
- తగ్గుముఖం పట్టిన గెడ్డల ఉధృతి
- కొట్టుకుపోయిన కల్వర్టులు
- చెరువులకు గండ్లు
- విద్యుత్ తీగలపై పడిన చెట్లు
- ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న కలెక్టర్

పాడేరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వర్షాలు పూర్తిగా తగ్గకపోవడంతో ఘాట్ మార్గాల్లో రాత్రి వేళల్లో వాహనాల రాకపోకల బంద్ కొనసాగుతున్నది. జిల్లాలో పాడేరు రెవెన్యూ డివిజన్‌లో వరదలకు గెడ్డలు ఉధృతంగా ప్రవహించడం వంటి సమస్యలుండగా, చింతూరు డివిజన్‌లో వరదలతో గ్రామాలు ముంపునకు గురికావడం, ఆయా ప్రాంత ప్రజలు పునరావాస కేంద్రాలను ఆశ్రయించడం జరుగుతున్నది. అలాగే జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్, జిల్లా యంత్రాంగం చింతూరు రెవెన్యూ డివిజన్‌లోని పర్యటిస్తూ వరద సహాయక, పునరావాస చర్యలు పక్కాగా అందేలా పర్యవేక్షిస్తున్నారు. అలాగే జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఎంజే.అభిషేక్ సైతం చింతూరు ప్రాంత పర్యటనకు సోమవారమే బయలుదేరారు.

- కొయ్యూరు మండలం మంప పంచాయతీ పైడిపణుకుల చెరువుకు గండి పడింది. దీంతో 50 ఎకరాలకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది.
- వరద ఉధృతికి జి.మాడుగుల పంచాయతీ సొడేకు సమీపంలో బొంజంగి గ్రామానికి వెళ్లే కల్వర్టు వరద ఉధృతికి కొట్టుకుపోయింది. పలు గ్రామాల్లో గిరిజనుల ఇళ్లు కూలిపోయాయి.
- గూడెంకొత్తవీధి మండలంలోని ఏబులం గ్రామం వద్ద చింతపల్లి-ధారకొండ 33 కేవీ విద్యుత్ తీగలపై భారీ వృక్షం పడింది. దీంతో ఏడు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అమ్మవారి ధారకొండ పంచాయతీ పరిధిలోని గొల్లపల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో తడ్డపల్లి, గొల్లపల్లి, పెబ్బంపల్లి గ్రామాలకు బాహ్య సంబంధాలు తెగిపోయాయి. దీంతో సోమవారం ఆర్‌వీనగర్ వారపు సంతకు గిరిజనులు రాలేదు.
- డుంబ్రిగుడ మండలంలో వరద నీరు చేరడంతో పంట పొలాలు మునిగిపోయాయి. పలు గ్రామాల్లో రైతులు వేసిన వరి నాట్లు కొట్టుకుపోయాయి.



కొయ్యూరు: వరద నీటి ఉధృతికి గండి పడిన పైడిపణుకుల చెరువు

నేడు విద్యాలయాలకు సెలవు

పాడేరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరదల తీవ్ర కొనసాగుతుండడంతో మంగళవారం కూడా జిల్లాలోని విద్యాలయాలకు సెలవును పొడిగిస్తూ జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ సోమవారం రాత్రి అత్యవసర ఉత్తర్వులు జారీ చేశారు. తొలుత 23న మంగళవారం చింతూరు డివిజన్‌లోని నాలుగు ముంపు మండలాలకు సెలవులు ప్రకటించారు. కాని సోమవారం వరదల ప్రభావం తగ్గకపోగా.. సాయంత్రం నుంచి వర్షాలు పెరగడంతో ముందు జాగ్రత్త చర్యగా మంగళవారం జిల్లావ్యాప్తంగా అన్ని విద్యాలయాలకు సెలవులు ప్రకటించారు. వరదల నేపథ్యంలో ప్రజలు గెడ్డలు, వాగులు దాటవద్దని, సురక్షిత ప్రాంతాల్లోనే ఉండాలని జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ సూచించారు.



జి.మాడుగుల : వరద ఉధృతికి కొట్టుకుపోయిన బొంజంగి కల్వర్టు

వరద బాధితులకు అండగా నిలవండి

- బియ్యం, పప్పులు, నూనెలను అందించండి
- వంటపాత్రలు, పాలు, బాలామృతం ఇవ్వండి
- పాము కాటు యాంటీవీనమ్‌ను సిద్ధంగా ఉంచండి
- కమాండ్ కంట్రోల్ రూమ్ నంబర్లు ప్రజలకు చెప్పండి
- టెలీకాన్ఫరెన్స్‌లో అధికారులకు కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశం

-వార్త 8వ పేజీలో...





పెరుగుతున్న గుంటవాడ జలాశయం. (ఇన్‌సెట్లో) గుంటవాడ జలాశయాన్ని పరిశీలిస్తున్న సీలేరు కాంప్లెక్సు జెన్‌కో చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు

పెరుగుతున్న నీటి మట్టాలు

- సీలేరు జలాశయాల్లోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో
- 1,357.3 అడుగులకు చేరిన గుంటవాడ జలాశయం
- జోలాపుట్, బలిమెల, డొంకరాయిల్లోకి చేరుతున్న వరద నీరు
- గుంటవాడకు 5 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- జోలాపుట్‌కు 10,457 క్యూసెక్కులు..
- బలిమెలకు 43,801 క్యూసెక్కులు..
- డొంకరాయికి 19,601 క్యూసెక్కులు..

సీలేరు, జూలై 22 : సీలేరు కాంప్లెక్సు పరిధిలోని గుంటవాడ జలాశయం నీటి మట్టం సోమవారం సాయంత్రానికి 1357.3 అడుగులకు చేరింది. ఈ జలాశయం గరిష్ఠ నీటి మట్టం 1,360 అడుగులు కాగా, ప్రస్తుతం 1,357.3 అడుగులకు చేరుకుంది. రిజర్వాయర్‌లో 1359.60 అడుగులకు నీటి మట్టం చేరితే నీటిని విడుదల చేయనున్నారు. పరిస్థితిని అంచనా వేసిన స్థానిక జెన్‌కో అధికారులు ఆదివారం మధ్యాహ్నం నుంచి జలాశయం దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. ఏ సమయంలోనైనా జలాశయం నుంచి నీరు విడుదల చేయవచ్చునని, దిగువన ఎవరూ సంచరించవద్దని, అలాగే పశువులు,మేకలను మేతకు తీసుకు వెళ్లవద్దని గుంటవాడ, దుప్పులవాడ, సీలేరు పంచాయతీల్లో ప్రజలకు సమాచారం అందించారు.

జలాశయాలకు భారీగా ఇన్‌ఫ్లో

వర్షాలకు భారీగా ఇన్‌ఫ్లో వస్తుండడంతో సీలేరు కాంప్లెక్సులోని జలాశయాల్లో నీటి మట్టాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ప్రస్తుతం జోలాపుట్ జలాశయానికి 10,457 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ... మిగతా 8వ పేజీలో



జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే అభిషేక్

గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తా

- జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఎం.జే.అభిషేక్
- వెంటనే చింతూరుకు పయనం

పాడేరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని నూతన జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్ అన్నారు. ఇన్నాళ్లు జేసీగా పనిచేసిన భావన వశిష్ఠను కాకినాడ మున్సిపల్ కమిషనర్‌గా నియమించడంతో ఆమె స్థానంలో రాష్ట్ర వార్డు, గ్రామ సచివాలయ శాఖ డైరెక్టర్‌గా పని చేస్తున్న డాక్టర్ ఎంజే.అభిషేక్‌ను నియమించిన సంగతి తెలిసిందే. దీంతో సోమవారం ఆయన కలెక్టరేట్‌కు వచ్చి జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం విలేకర్లతో మాట్లాడారు. కర్నాటక రాష్ట్రానికి చెందిన తాను తొలుత ఎంబీబీఎస్ చేశానని, తర్వాత సివిల్స్‌పై ఆసక్తితో అటుగా అడుగులు వేసి 2020లో ఐఏఎస్ బ్యాచ్ అధికారిని అయ్యానన్నారు. గతంలో అసోంలో పని చేశానని, దీంతో గిరిజనులు, వారి ప్రాంతాల పట్ల కొంత అవగాహన ఉందన్నారు. అలాగే గిరిజనులకు తనవంతు ... మిగతా 8వ పేజీలో

ముంపు ప్రాంతాల్లో ముమ్మరంగా సహాయక చర్యలు

- మూడు రోజులుగా చింతూరులో కలెక్టర్ మకాం
- వరద ప్రాంతాల్లో ట్రాక్టర్‌పై పర్యటన
- సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్న నలుగురు ఐఏఎస్ అధికారులు



వరద ప్రభావిత ప్రాంతాల్లో ట్రాక్టర్‌పై పర్యటిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, పక్కన చింతూరు ఐటీడీఏ పీవో చైతన్య

పాడేరు (చింతూరు), జూలై 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వరదల ప్రభావం అధికంగా ఉన్న చింతూరు రెవెన్యూ డివిజన్‌లో సహాయక, పునరావాస చర్యలను జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్‌తో పాటు ముగ్గురు ఐఏఎస్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. గత మూడు రోజులుగా చింతూరులోనే మకాం వేసిన కలెక్టర్ రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులను అప్రమత్తం చేశారు. సోమవారం కలెక్టర్ దినేశ్‌కుమార్, చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య, రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే, సబ్‌కలెక్టర్ ప్రశాంత్‌కుమార్‌లతో కలిసి సోమవారం చింతూరు, కూనవరం, వీఆర్‌పురం మండలాల్లో వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. కలెక్టర్ దినేశ్‌కుమార్ చింతూరు మండలంలో, రంపచోడవరం ఐటీడీఏపీవో సూరజ్‌గనోరే కూనవరం మండలంలో, రంపచోడవరం సబ్‌కలెక్టర్ వీఆర్.పురం మండలంలో, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఏటపాక మండలంలో పర్యటిస్తూ సహాయ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు.



కూనవరంలో తాత్కాలిక నివాసాల్లోని ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

వరద ప్రాంతాల్లో ట్రాక్టర్‌పై ప్రయాణించిన కలెక్టర్

వరద ముంపు ప్రాంతాల్లో కలెక్టర్ దినేశ్‌కుమార్ ట్రాక్టర్‌పై ప్రయాణించారు. చింతూరు ... మిగతా 8వ పేజీలో

డుడుమ సౌందర్యం



డుడుమ జలపాతం ఉరకలేస్తూ ప్రవహిస్తున్న దృశ్యం

ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ఉరకలేస్తున్న డుడుమ జలపాతాలు.. వాటిని ముద్దాడుతూ పయనిస్తున్న నీలి మేఘాలు.. చుట్టూ ఎత్తైన పచ్చని గిరులు.. ఆపై నింగి నుంచి పడుతున్న తుంపర జల్లులు పర్యాటకులను మైమరపిస్తున్నాయి. సుమారు 800 అడుగుల ఎత్తు నుంచి జాలువారుతున్న మూడు జలపాతాలు చూసేందుకు రెండు కళ్లు సరిపోవడం లేదు. ఆ ప్రాంతమంతా భూతల స్వర్గాన్ని తలపిస్తోంది. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు వరద నీరు చేరడం, డుడుమ గేట్లను ఎత్తివేయడంతో ఆ జలపాతాల సౌందర్యం రెట్టింపు అయ్యింది. రెండు జలపాతాలను నీలి మేఘాలు ముద్దాడుతూ ముందుకు కదులుతున్న దృశ్యాన్ని సోమవారం 'ఆంధ్రజ్యోతి' కెమెరాలో బంధించింది. ప్రస్తుతం నీరు అధికంగా ప్రవహించడంతో కేవలం రెండు జలపాతాలు మాత్రమే కనిపిస్తున్నాయి. మూడో జలపాతం మంచు తుంపర్లు, నీలి మేఘాలు కమ్ముకోవడంతో కనిపించడం లేదు.

-ముంచంగిపుట్టు



నిలకడగా డుడుమ నీటి మట్టం

600 క్యూసెక్కుల నీరు విడుదల

ముంచంగిపుట్టు, జూలై 22: మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి నీరందించే డుడుమ జలాశయంలో నీటి నిల్వలు నిలకడగా ఉన్నాయి. జలాశయంలో నీటి మట్టం ఆదివారం ప్రమాద స్థాయికి చేరడంతో రెండు గేట్లను ఎత్తివేసి బలిమెలకు 2వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. జలాశయం గరిష్ఠ నీటి మట్టం 2,590 అడుగులు కాగా.. సోమవారం నాటికి 2,588.5 అడుగులకు చేరింది. దీంతో ఆరో నంబరు గేటు ద్వారా బలిమెలకు 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. వరద నీటితో జలాశయం కళకళలాడుతోంది. జలవిద్యుత్ కేంద్రంలో రెండు జనరేటర్ల సహాయంతో 46 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన జరుగుతోంది.

క్రైం... crime news

ప్రమాదవశాత్తూ కాలువలో పడి ఒకరి మృతి



రామారావు మృతదేహం

రాంబిల్లి, జూలై 22: మండలంలోని లాలంకోడూరు పంచాయతీ పెద్ద యాతపాలెం సమీపంలోని కాలువలో ప్రమాదవశాత్తూ పడి ఓ వ్యక్తి మృతి చెందాడని ఎస్ఐ రంగారావు తెలిపారు. దీనికి సంబంధించి ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. శ్రీకాకుళం జిల్లా లంక గ్రామానికి చెందిన గడిదేశి రామారావు(55) సీతపాలెం సమీపంలోని గల సన్వీర కంపెనీలో కాంట్రాక్టర్ వద్ద పనిచేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలు సమయంలో అతను బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తూ కాలువలో పడి మృతి చెందాడు. రాంబిల్లి సర్కిల్ సీఐ నర్శింగరావు ఆదేశాలు మేరకు ఎస్ఐ సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి కాలువలో పడి ఉన్న రామారావు మృతదేహాన్ని బయటకు తీసి, అంబులెన్స్‌లో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చామని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

కారు బోల్తా పడి యువకుడి మృతి

- ముగ్గురికి తీవ్ర గాయాలు
- నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలింపు



ప్రమాదంలో మృతి చెందిన బొడ్డు నాని

నాతవరం, జూలై 22 : కారు బోల్తా పడి యువకుడు మృతి చెందాడు. ముగ్గురు తీవ్రంగా గాయపడడంతో నర్సీపట్నం ప్రాంతీయాస్పత్రికి తరలించారు. నాతవరం పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. సోమవరం నాతవరం ఎస్సీ కాలనీకి చెందిన బొడ్డు నాని, మరో ముగ్గురు యువకులతో కారులో బయటకు వెళ్లారు. రాత్రి పది గంటలు దాటి తర్వాత గొలుగొండ నుంచి వల్లంపేట మీదుగా నాతవరం వస్తున్నారు. వల్లంపేట సమీపంలో అదుపుతప్పి కారు బోల్తా పడింది. ప్రమాదంలో బొడ్డునాని (22) అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడడంతో 108లో నర్సీపట్నం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. నాతవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బోల్తా పడిన కారు

యువకుడి అదృశ్యం

- కొండ వాగులో కొట్టుకుపోయాడనే అనుమానాలు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన కుటుంబీకులు



యువకుడు జయవర్ధన్(ఫైల్)

కొయ్యూరు, జూలై 22: మండలంలో శరభన్నపాలెం గ్రామానికి చెందిన రీముల జయవర్ధన్ అలియాస్ బాబి(22) ఆదివారం సాయంత్రం అదృశ్యమయ్యాడు. ఈ యువకుడు కత్తిరాలలొద్ది సమీప కొండవాగులో గలంతైనట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శరభన్నపాలెంకు చెందిన జయవర్ధన్ ఆదివారం సాయంత్రం విశాఖపట్నం నుంచి స్వగ్రామం వస్తూ.. కత్తిరాలలొద్ది మీదుగా నడింపాలెం వెళ్లి.. అక్కడ నుంచి శరభన్నపాలెం వెళ్లేందుకు సిద్ధపడినట్టు సమాచారం. ఈ క్రమంలో కత్తిరాలలొద్ది వద్ద సాయంత్రం 6.30 గంటల సమయంలో కొండవాగును దాటేందుకు ప్రయత్నించాడని తెలిసింది. అనంతరం అతని ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో విషయాన్ని తెలుసుకున్న తండ్రి మోహన్ రాత్రి 9 గంటల వరకు జయవర్ధన్ ఫోన్‌కు ప్రయత్నించగా.. రింగ్ అయినా ఎత్తకపోవడం అనంతరం ఫోన్ పనిచేయకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో కుటుంబీకులు విషయాన్ని కొయ్యూరు ఎస్ఐ రామకృష్ణకు సమాచారమిచ్చారు. విషయం తెలుసుకున్న తహసీల్దారు రాజేశ్వరరావు రామరాజుపాలెం వెళ్లి వివరాలు సేకరించారు. అలాగే కొయ్యూరు ఎస్ఐ రామకృష్ణ తన సిబ్బందితో సంఘటన జరిగినట్టుగా అనుమానిస్తున్న స్థలానికి చేరుకుని జయవర్ధన్ కోసం అన్వేషించారు. అయితే అదృశ్యమైన జయవర్ధనకు మూర్ఛ వ్యాధి ఉన్నట్టు తెలిసింది. ఈ క్రమంలో కొండవాగు దాటుతూ మూర్ఛ వాధి బారిన పడి గల్లంతు అయ్యాడా? లేక మరెక్కడైనా పడిపోయి అపస్మారక స్థితికి చేరుకున్నాడా అనేది మిస్టరీగా మారింది.

గర్భిణికి తప్పని ప్రసవ వేదన

- ఉధృతంగా కోడాపుట్టు గెడ్డ
- పురిటి నొప్పులు వచ్చినా ఇంట్లోనే రెండు రోజులు
- అనంతరం జీపులో ముంచంగిపుట్టు పీహెచ్‌సీకి తరలింపు
- సిజేరియన్ చేసి మృత శిశువును బయటకు తీసిన పాడేరు వైద్యులు



గర్భిణీని జీపు ఎక్కుస్తున్న దృశ్యం



మృతిచెందిన శిశువు

ముంచంగిపుట్టు, జూలై 22: గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ కోడాపుట్టు గ్రామానికి చెందిన నెలలు నిండిన గర్భిణీ కొర్రా సొనాయ్ (25) వైద్య సేవలు అందక ప్రసవ వేదన పడింది. గర్భిణికి శుక్రవారం అర్ధరాత్రి నుంచి పురిటి నొప్పులు వచ్చాయి. అయితే ఆ గ్రామ సమీపంలో గెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో ఇల్లు దాటలేని పరిస్థితి ఏర్పడింది. ఏమి చేయాలో తెలియక రెండు రోజులు పాటు నొప్పులతో ఇంటిలోనే ఆమె ఉండిపోవల్సి వచ్చింది. ఎలాగైనా తల్లీబిడ్డలను బతికించుకోవాలనే తపనతో భర్త నాగేశ్వరరావు, కుటుంబ సభ్యులు గర్భిణీని ప్రైవేటు జీపులో ఒడిశా మీదుగా 70 కిలోమీటర్లు ప్రయాణం చేసి ఆదివారం ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి తీసుకువచ్చారు. గర్భిణీని పరీక్షించిన డాక్టర్ వెంటనే పాడేరు జిల్లా ఆస్పత్రికి తీసుకు వెళ్లాలని సూచించారు. అక్కడికి గర్భిణీని తీసుకువెళ్లగా వైద్యులు పరీక్షలను నిర్వహించిన అనంతరం ఆపరేషన్ చేసి చనిపోయిన బిడ్డను బయటకు తీశారని లక్ష్మీపురం సర్పంచ్ క్షేత్రినాథ్ తెలిపారు. ప్రస్తుతం తల్లి మృత్యువుతో పోరాడుతుందన్నారు. తమ పంచాయతీ పరిధిలో ప్రవహిస్తున్న గెడ్డలపై కల్వర్టులు, వంతెనలు, కాజ్‌వేలు నిర్మించకపోవడం వలన వర్షాకాలంలో ఆస్పత్రులకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

28 నుంచి అమరుల సంస్మరణ వారోత్సవాలు

జి.మాడుగుల, జూలై 22 : ఏవోబీ వ్యాప్తంగా ఈనెల 28 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు మావోయిస్టు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని మావోయిస్టు ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గణేశ్ పిలుపునిచ్చారు. కామ్రేడ్స్ చారుమజుందర్ అమరత్వ దినం జూలై 28న వేలాది మంది అమరులను స్మరించుకుంటూ అమరుల సమస్మరణ వారోత్సవాలను జరుపుకుంటునట్టు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత పాశవికంగా ప్రజలపై కొనసాగిస్తున్న ఆపరేషన్ కగార్ దాడుల మధ్యన జరుపుకోంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 2024 జనవరి నుంచి ప్రారంభమైన ఆపరేషన్ కగార్‌లోనే అనతికాలంలో 160 మందికిపైగా విప్లవకారులు ప్రాణాలర్పించారన్నారు. వీరిలో 6 నెలల పాపా మొదలుకొని 60 ఏళ్ల వృద్ధుల వరకు ఉన్నారని పేర్కొన్నారు. అమరుల త్యాగాలను ఏవోబీ జోన్ వ్యాప్తంగా స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. అమరుల ఆశయ సాధన కోసం తుది శ్వాస వరకు పోరాడతామని శపథం చేశారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	92.00
లైవ్ ధర	112.00
విత్ స్కిన్	194.00
స్కిన్ లెస్	204.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

జలాశయాలకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

- కల్యాణపులోవ రెండు గేట్లు ఎత్తి 100 క్యూసెక్కుల నీరు విడుదల



కల్యాణపులోవ రిజర్వాయర్ రెండు గేట్లు ద్వారా విడుదల చేస్తున్న నీరు

రావికమతం, జూలై 22: మండలంలో కల్యాణపులోవ జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. దీంతో రెండు గేట్లు ఎత్తి సర్పానదిలోకి వంద క్యూసెక్కుల నీటిని అధికారులు విడిచిపెడుతున్నారు. రిజర్వాయర్‌లోకి వస్తున్న ఇన్‌ఫ్లోకు అనుగుణంగా నీటిని విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ ఏఈ సత్యనారాయణదొర తెలిపారు. జలాశయం గరిష్ఠ నీటి మట్టం 460 అడుగులు కాగా సోమవారం నాటికి 459 అడుగులకు నీటి మట్టం పెరిగిందన్నారు. రిజర్వాయర్ ఎగువన విస్తారంగా కురుస్తున్న వర్షాలకు ఇన్‌ఫ్లో 75 క్యూసెక్కుల మేర జలాశయంలోకి వస్తుండడంతో రిజర్వాయర్ నీటి మట్టం పెరుగుతూ వస్తుందన్నారు. ఇప్పటి వరకు నాలుగు సార్లు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశామన్నారు. సోమవ్వారం సాయంత్రం రెండు గేట్లు ఎత్తి వంద క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టామన్నారు. సర్పానది ప్రవహించే మూడు మండలాల గ్రామాల ప్రజలను అప్రమత్తంగా చేశామన్నారు.

పెద్దేరు జలాశయం నీరు విడుదల



పెద్దేరు జలాశయం గేట్లు ఎత్తి నీటిని విడిచిపెట్టిన దృశ్యం

మాడుగుల రూరల్, జూలై 22: పెద్దేరు జలాశయానికి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. రిజర్వాయర్‌లోకి 500 క్యూసెక్కులు నీరు చేరుతోంది. దీంతో పెద్దేరు జలాశయం నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరువైంది. జలాశయం గరిష్ఠ నీటి మట్టం 137 మీటర్లు కాగా ప్రస్తుతం 136.40 మీటర్లకు చేరుకుంది. ఇన్‌ఫ్లో 500 క్యూసెక్కులు వస్తుండడంతో జలాశయం అధికారులు అప్రమత్తమై ఆదివారం రాత్రి తొమ్మిది గంటల తర్వాత జలాశయం మూడు గేట్లు తెరిచి 585 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టారు. సోమవారం ఉదయం గేట్లను మూసేశారు. కాగా సోమవారం సాయంత్రానికి 500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో నీటి మట్టం 136.45 మీటర్లకు చేరిందని, రాత్రికి మరో 500 క్యూసెక్కుల నీటిని విడిచిపెడతామని ఏఈ సుధాకర్ రెడ్డి తెలిపారు. పెద్దేరు నదీ ప్రవాహ సమీప గ్రామాల వారు అప్రమత్తంగా ఉండాలని, నదీ ప్రవాహంలో దిగరాదని సూచించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- కలెక్టర్ విజయకృష్ణన్



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

తుమ్మపాల, జూలై 22: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ప్రతి అర్జీ పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి, రమామణి, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యం

- ఎస్పీ ఎం.దీపిక



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ ఎం.దీపిక

తుమ్మపాల, జూలై 22: బాధితులకు న్యాయం చేకూర్చడమే లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలని ఎస్పీ ఎం.దీపిక ఆదేశించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆయా సమస్యలపై పోలీస్‌శాఖకు 37 ఫిర్యాదులు అందాయని చెప్పారు. అందులో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, చీటింగ్ వంటి ఫిర్యాదులు అందాయన్నారు. ఫిర్యాదులను చట్టపరిధిలో సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, ఎస్ఐ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

రూ.25 లక్షల విలువైన మొబైల్ ఫోన్లు రికవరీ

- బాధితులకు అందజేత

అనకాపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అపహరణకు గురైన రూ.25 లక్షల విలువైన 176 మొబైల్ ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. వీటిని బాధితులకు ఎస్పీ ఎం.దీపిక సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 3,500 మంది మొబైల్స్ పోయిన వారు మొబైల్ మిస్సింగ్ పోర్టల్‌కు ఫిర్యాదులు చేయగా, ఆరు విడతల్లో 1,756 మొబైల్ ఫోన్‌లను రికవరీ చేసి వారికి అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ విజయభాస్కర్ (అడ్మిన్), తదితరులు పాల్గొన్నారు.



మొబైల్ ఫోన్‌ను బాధితురాలికి అందిస్తున్న ఎస్పీ ఎం.దీపిక. చిత్రంలో ఏఎస్పీ విజయభాస్కర్, తదితరులు

వరి నారుమడుల్లో సస్యరక్షణ చేపట్టాలి

- జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

తుమ్మపాల, జూలై 22: వరి నారుమడుల్లో రైతులు సస్యరక్షణ చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి డి. మోహనరావు సూచించారు. సోమవారం తుమ్మపాలలో నీట మునిగిన వరి నారుమడులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలు రైతులకు మేలు చేకూరుస్తాయన్నారు. అయితే ఇప్పటికే రైతులు వేసిన ఎద చేనులు నీట మునిగాయని, తక్షణమే రైతులు నీటిని తొలగించే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. నీటిని తొలగించిన తరువాత వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తూ పలు రకాల ఎరువులు చల్లుకున్నట్టయితే పంట ఆరోగ్యవంతంగా ఉంటుందన్నారు. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు జిల్లా వ్యాప్తంగా దాదాపు 230 ఎకరాల్లో నారుమడులు ముంపునకు గురయ్యాయని గుర్తించామన్నారు. ఈ ఏడాది జూలై నెల వరకు సరైన వర్షాలు లేకపోవడంతో రైతులు విత్తనాలు చల్లుకోలేదన్నారు. దీంతో ఆలస్యంగా విత్తనాలు చల్లడంతో పెద్దగా పంట నష్టం వాటిల్లే అవకాశం లేదన్నారు. అయితే కురుస్తున్న వర్షాలకు జిల్లాలో రాంబిల్లి, ఎస్.రాయవరం, కోటపాడు, రోలుగుంట, బుచ్చెయ్యపేట మండలంతో పాటు శారదానది పరివాహక ప్రాంత రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనకాపల్లి డివిజన్ పరిధిలో అనకాపల్లి మండలం, కశింకోట, మునగపాక మండలాల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ కురిసిన వర్షాల కారణంగా రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామన్నారు. రైతులకు అధికారులు ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నట్టు చెప్పారు. మరో 24 గంటలు వర్షాభావ పరిస్థితులున్నట్టు సమాచారం ఉండడంతో పరిస్థితులను సమీక్షిస్తున్నామని చెప్పారు. ఆయా శాఖల అధికారుల సమన్వయంతో ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ ఎం.రామారావు, మండల వ్యవసాయాధికారి పి. రంగాచారి, ఇరిగేషన్ జేఈ హనుమంతరావు, తుమ్మపాల పంచాయతీ ఈవో ఈశ్వరరావు, సర్పంచ్‌లు తట్టా పెంటయ్యనాయుడు, రామకృష్ణ, గ్రామ నాయకులు కర్రి బాబీ, పీలా బుజ్జి, కోన అప్పారావు, పీలా విశ్వేశ్వరరావు, పెతకంశెట్టి బలరాం, పంచదార్ల కన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

7న జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నిక

- నోటిఫికేషన్ జారీచేసిన ఇన్‌చార్జి కమిషనర్ హరీంధిర ప్రసాద్
- 30 వరకూ నామినేషన్ల స్వీకరణ

విశాఖపట్నం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నిక వచ్చే నెల ఏడున నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ హరీంధిర ప్రసాద్ సోమవారం నోటిఫికేషన్ జారీచేశారు. స్టాండింగ్ కమిటీ పది మంది సభ్యులను 97 మంది కార్పొరేటర్లు ఎన్నుకోవలసి ఉంటుంది. సోమవారం నుంచి ఈనెల 30వ తేదీ వరకూ ఉదయం 11 నుంచి మూడు గంటలు వరకూ జీవీఎంసీ కార్యదర్శి కార్యాలయంలో నామినేషన్ల పత్రాలు అందుబాటులో ఉంచుతారు. పూర్తిచేసిన నామినేషన్ పత్రాలను ఈనెల 30లోగా అదనపు కమిషనర్ (జనరల్) కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది. ఆదేరోజు సాయంత్రం ఐదు గంటలకు నామినేషన్ల జాబితాను ప్రచురిస్తారు. 31న ఉదయం 11 గంటల నుంచి నామినేషన్ల పరిశీలన, అదేరోజు సాయంత్రం అనుమతించిన నామినేషన్ల ప్రచురణ జరుగుతుంది. మూడో తేదీ మధ్యాహ్నం మూడు గంటల వరకూ నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. అదే రోజు సాయంత్రం పోటీలోఉన్న అభ్యర్థుల జాబితాను ప్రచురిస్తారు. ఏడో తేదీ ఉదయం పది నుంచి మధ్యాహ్నం రెండు గంటలు వరకూ జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని పాత కౌన్సిల్‌హాలులో పోలింగ్ జరుగుతుంది. అదేరోజు సాయంత్రం ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన ఉంటుంది.

వరి నారుమడుల్లో సస్యరక్షణ తప్పనిసరి

అనకాపల్లి అగ్రికల్చర్, జూలై 22: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరి పైరుకు పొడ తెగులు ఆశించే అవకాశం ఉన్నందున రైతులు తగిన సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఆర్ఏఆర్ఎస్ సస్య రక్షణ విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కేవీ రమణమూర్తి సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వరి నారు చనిపోవడం ప్రారంభమైనా, ఎండిపోతున్నా 2 మిల్లీ లీటర్ల ఎక్సాకొనజోల్ మందు లీటరు నీటికి కలిపి ఒకసారి పిచికారీ చేయాలని చెప్పారు. నారు నీట మునిగి ఉన్నట్టయితే నీటిని తొలగించి 2 కిలోల యూరియా, ఒక కిలో పొటాష్‌లను 5 సెంట్ల నారుమడిలో చల్లాలని, జింకు లోపాన్ని గమనిస్తే 2 మిల్లీ లీటర్ల జింకు సల్ఫేట్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఇనుపదాతు లోపం ఉంటే నారు ఎర్రబారుతుందని, దీని నివారణకు 20 గ్రామాల అన్నబేదీని లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

ఇందేశమ్మ ఘాట్ రోడ్డు గోతులమయం



కోటవురట్ల, జూలై 22: మండలంలోని ఇందేశమ్మ ఘాట్ రోడ్డు గోతులతో అధ్వానంగా ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గోతుల్లో నీరు చేరి వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ రహదారికి నామమాత్రంగా మరమ్మతులు చేసి వదిలేశారు. ప్రస్తుతం ఈ మార్గంలో ప్రయాణించాలంటే వాహనచోదకులు బెంబేలెత్తిపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రహదారికి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న ఇందేశమ్మ ఘాట్ రోడ్డు

పడకేసిన సీలేరు జల విద్యుత్కేంద్రం

- ప్రస్తుతం నాలుగో వంతే ఉత్పత్తి
- సాంకేతిక లోపాలతో మూడు యూనిట్లు నిలిపివేత
- నీటి వనరులు పుష్కలంగా ఉన్నా ఒక్క యూనిట్ ద్వారా మాత్రమే విద్యుత్ ఉత్పత్తి



సీలేరు జలవిద్యుత్ కేంద్రం

సీలేరు, జూలై 22: అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం గుంటవాడ జలాశయంలో నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ సీలేరు విద్యుత్ కేంద్రంలో కేవలం ఒక్క యూనిట్ ద్వారా మాత్రమే విద్యుదుత్పత్తి జరుగుతుంది. సీలేరు జల విద్యుత్ కేంద్రంలో 240 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం (ఒక్కొక్కటి 60 యూనిట్లు) గల నాలుగు యూనిట్లు ఉండగా ప్రస్తుతం ఒక్కటి మాత్రమే పనిచేస్తోంది. సీలేరు జల విద్యుత్ కేంద్రంలో మొదటి దశలో నిర్మించిన ఒకటి, రెండు (రెండు యూనిట్లు) యూనిట్లు 50 సంవత్సరాలకు పైబడినవి కాగా, మిగతా మూడు, నాలుగు యూనిట్లు 30 సంవత్సరాలకు పైబడినవి. యూనిట్ల జీవన కాలపరిమితి (లైఫ్ టైమ్) మించడంతో ఇటీవల తరచుగా మరమ్మతులకు గురవుతూ మొరాయిస్తున్నాయి. మొదటి యూనిట్‌లో స్టాటర్ ఎర్త్ సమస్యతో 40 రోజుల క్రితం ఉత్పత్తి నిలిచిపోయింది. ఈ యూనిట్‌కు ఏడాది క్రితం పూర్తి ఓవర్‌హాలింగ్ నిర్వహించినప్పటికీ కొద్దిరోజులకే మళ్లీ స్టాటర్ ఎర్త్ సమస్య రావడంతో పనులు నిర్వహించిన కంపెనీపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. అలాగే రెండో యూనిట్ కూడా ప్రస్తుతం వినియోగంలో లేదు. వారం క్రితం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గల బస్‌బార్ల నుంచి నీరు లోపలకు ప్రవేశించి ఎర్త్ సమస్య తలెత్తడంతో నాలుగో నంబర్ యూనిట్‌లో కూడా విద్యుదుత్పత్తి నిలిచిపోయింది. ప్రస్తుతం మూడో యూనిట్‌లో మాత్రమే విద్యుదుత్పత్తి జరుగుతోంది. ఈ ప్రాంతంలో కురుస్తున్న భారీవర్షాలకు గుంటవాడ జలాశయంలోకి పుష్కలంగా నీరు చేరినప్పటికీ విద్యుత్ ఉత్పత్తి చెయ్యడానికి యూనిట్లు అందుబాటులో లేవు. స్థానిక జెన్‌కో అధికారులు నాలుగో యూనిట్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు బస్‌బార్‌లలోకి నీరు లీక్ కాకుండా కాంక్రీట్ పనులు, గ్రౌటింగ్ పనులు చేసినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. మరోపక్క జలాశయంలో నీటి నిల్వలు రోజురోజుకీ పెరిగిపోతుండడంతో నీటిని దిగువకు వృథాగా వదిలి పెట్టాల్సి వస్తోందని జెన్‌కో అధికారులు అంటున్నారు. ఏదిఏమైనప్పటికీ సీలేరు కాంప్లెక్సులో యూనిట్ల నిర్వహణ పనులను సరైన సంస్థలకు అప్పగించకపోవడం వల్లనే తరచూ సాంకేతిక లోపాలు తలెత్తుతున్నాయని పలు విమర్శలు తలెత్తుతున్నాయి.

జిల్లా స్థాయి తైక్వాండో టోర్నీలో ప్రతిభ

ఎలమంచిలి, జూలై 22: విశాఖ జిల్లా గాజువాక నడుపూరు ఉక్కు కళా వేదికలో జరిగిన 34వ జూనియర్, సీనియర్ జిల్లా స్థాయి తైక్వాండో టోర్నీలో ఎలమంచిలి క్రీడాకారులు 8 బంగారు పతకాలు సాధించినట్టు తైక్వాండో కోచ్ నగిరెడ్డి సత్యనారాయణ తెలిపారు. ఆదివారం జరిగిన ఈ టోర్నీలో ఎలమంచిలి సత్య స్పోర్ట్సు అకాడమీకి చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరిచారన్నారు. భవ్యశ్రీ, ఎం.హర్షిత, జయశ్రీ, వి.సౌజన్య, గాయత్రి, టి.శ్వేత, ఎన్.మోహిత్, అరుణ్‌కుమార్‌లు బంగారు పతకాలు సాధించినట్టు తెలిపారు. వుడా నందకృష్ణ, విష్ణువర్ధన్‌లు రజిత పతకాలు సాధించినట్టు తెలిపారు.

గరీబ్‌రథ్‌కు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు

- అదనంగా అందుబాటులోకి 117 థర్డ్ ఏసీ బెర్తులు

విశాఖపట్నం, జూలై 22: విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ వెళ్లే గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ (12739) మంగళవారం కొత్త ఆధునిక ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో బయలుదేరనుంది. ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్) రేక్ స్థానంలో లింక్ హాఫ్‌మన్ బుష్ (ఎల్‌హెచ్‌బీ) కోచ్‌లతో సోమవారం సికింద్రాబాద్‌లో బయలుదేరిన గరీబ్‌రథ్ మంగళవారం ఉదయం విశాఖ చేరుకోనున్నది. ఇక్కడ నుంచి రాత్రి 8.40 గంటలకు తిరిగి సికింద్రాబాద్ బయలుదేరనున్నది. ఇప్పటివరకూ 17 థర్డ్ ఏసీ, రెండు జనరేటర్ మోటారు కోచ్‌లతో కలిపి 19 కోచ్‌లతో (ఐసీఎఫ్ రేక్) రాకపోకలు సాగించిన గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్..మంగళవారం నుంచి 18 థర్డ్ ఏసీ ఎకానమీ ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో నడవనుంది. గతంలో కోచ్‌కు 81 బెర్తులు చొప్పున 17 కోచ్‌లకుగాను 1,377 థర్డ్ ఏసీ బెర్తులు అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం ఎల్‌హెచ్‌బీ రేక్ ద్వారా కోచ్‌కు 83 చొప్పున 18 కోచ్‌లకుగాను 1,494 బెర్త్‌లు అందుబాటులోకి వచ్చాయి. గతంకంటే మరో 117 బెర్తులు జత కానున్నాయి. ఇప్పటివరకూ ఐసీఎఫ్ రేక్‌తో నడిచిన గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌లో సైడ్ విండో మిడిల్ బెర్తులు ఉండేవి. ఇరుకుగా ఉండే ఈ బెర్తు చిన్న పిల్లలకు మినహా మిగిలిన వారికి సౌకర్యకరంగా ఉండేది కాదని అభిప్రాయాలున్నాయి. తప్పనిసరి పరిస్థితులలో ఇబ్బందికరంగా ప్రయాణించేవారు. సైడ్ మిడిల్ బెర్తులను తొలగించాలని ప్రయాణికులు రైల్వే శాఖకు విజ్ఞప్తి చేసిన సందర్భాలున్నాయి. ఈ నేపథ్యంలో కొత్త ఆధునిక ఎల్‌హెచ్‌బీ కోచ్‌లలో సైడ్ విండో మిడిల్ బెర్తు తొలగించారు.


కొయ్యూరు మండలంల చింతలపైడి రహదారిపై హోరున కురుస్తున్న వర్షం


చింతపల్లి మండలం లోతుగెడ్డలో గృహాల చుట్టూ చేరిన వర్షపు నీరు


డుంబ్రిగుడలో నీట మునిగిన వరి పంట పొలాలు

మన్యాన్ని వీడని వర్షం.. జన జీవనం అస్తవ్యస్తం

మన్యాన్ని వర్షం వదలడం లేదు. నాలుగు రోజులుగా వర్షాలు పడుతూనే ఉండడంతో జలాశయాలు, పంట పొలాలు నీట మనిగాయి. గెడ్డలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.చాఆలా గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. దీంతో జన జీవనం అస్తవ్యస్తంగా మారిపోయింది.

నీట మునిగిన పంట పొలాలు, జలాశయాలు
రహదారులకు కోతలు.. ఎక్కడికక్కడే కూలిపోయిన చెట్లు
జల దిగ్బంధంలో గ్రామాలు.. గిరిజనులకు తప్పని కష్టాలు

కొయ్యూరు, జూలై 22: మండలంలో వర్షం కురుస్తూనే ఉంది. నాలుగు రోజులుగా పడుతున్న భారీ వానతో కృష్ణాదేవిపేట నుంచి శరభన్నపాలెం వెళ్లే మార్గంలో సుమారు 30 గ్రామాలకు రవాణా కష్టాలు కొనసాగుతున్నాయి. అలాగే యు.చీడిపాలెం పంచాయతీలో గొట్లపాడు వేమన్నపాలెం, ఈదులబంద వద్ద కొండ వాగు ప్రవాహాల ఉధృతి తగ్గకపోవడంతో సుమారు 20 గ్రామాలు బాహ్య ప్రపంచానికి దూరంగానే ఉన్నాయి. మంప పంచాయతీలోని పైడిపణుకులలో ఇటీవల వాటర్ షెడ్ పథకంలో మూడు ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన చెరువు గండి పడింది. దీంతో సుమారు 50 ఎకరాలకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది. ఈ గండిని తక్షణమే పూడ్చి సాగునీటి కొరతను నివారించేలా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు. అలాగే మరో 24 గంటలు వర్షం కొనసాగుతుందనే వాతావరణ హెచ్చరికలతో మండల వాసులు ఆందోళన చెందుతున్నారు.

చింతపల్లిలో...

చింతపల్లి: మండలంలోని లోతుగెడ్డ జంక్షన్ ప్రజలు జల దిగ్బంధంలో జీవించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గృహాల చుట్టూ వర్షపు నీరు చేరుకోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తాజాగా లోతుగెడ్డ గ్రామంలో గృహాల కంటే సుమారు రెండు మీటర్ల ఎత్తులో జాతీయ రహదారి నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కొండపై నుంచి వస్తున్న వరద బయటకు పోయే మార్గంలేక గృహాల చుట్టూ నిలిచిపోయింది. దీంతో గృహాల లోపలికి వర్షపు నీరు చేరుకోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. జాతీయ రహదారి అధికారులు స్పందించి గృహాల చుట్టూ నిలిచిపోయిన వర్షపు నీరు బయటకుపోయే మార్గం ఏర్పాటు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

జి.మాడుగులలో...

జి.మాడుగుల: మండలంలోని వరద ఉధృతి కొనసాగుతోంది. ఎడతెరిపిలేని వానలకు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఇళ్లు నేలమట్టమవుతున్నాయి. సోమవారం కురిసిన వర్షానికి జి.మాడుగుల పంచాయతీ సాడేకు సమీపంలో బొంజంగి గ్రామానికి వెళ్లే కల్వర్టు వరద ఉధృతికి కొట్టుకుపోయింది. అలాగే సాడేకు గ్రామానికి చెందిన ఇద్దరు గిరిజనుల ఇళ్లు నేలకూలాయి. పాలమామిడి పంచాయతీ కొక్కిరాపల్లి గ్రామానికి చెందిన కిముడు జోగులమ్మ ఇల్లు ధ్వంసమైంది. పలు చోట్ల


ముంచంగిపుట్టు మండలం పనస గ్రామంలో ఇంటిపై పడిన చింతచెట్టు

చెట్టుకొమ్మలు విరిగిపడి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.

గూడెంకొత్తవీధిలో...

గూడెంకొత్తవీధి: మంలంలోని అమ్మవారి ధారకొండ పంచాయతీ పరిధిలోని గొల్లపల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పలు గ్రామాలకు బాహ్య సంబంధాలు తెగిపోయాయి. వాగు ఉధృతి కారణంగా సోమవారం ఆర్‌వీనగర్ వారపు సంతకు గిరిజనులు రాలేదు. తడ్డపల్లి, గొల్లపల్లి, పెబ్బంపల్లి గ్రామాల గిరిజనులు గొల్లపల్లి వాగు దాటుకుని పొరుగు గ్రామాలకు వెళ్లాలి. సోమవారం ఆర్‌వీ నగర్ వారపు సంతకు వచ్చి గిరిజనులు వారానికి సరిపడిన నిత్యవసర సరకులు కొనుగోలు చేసి గృహాలకు తీసుకొని వెళుతుంటారు. అప్పపీడం కారణంగా మూడు రోజులు విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో గొల్లపల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. దీంతో ఆదివాసీలు గ్రామాలకే పరిమితమయ్యారు. ఏబులం గ్రామం వద్ద చింతపల్లి-ధారకొండ 33కేవీ విద్యుత్ తీగలపై భారీ వృక్షం కూలిపడింది. దీంతో ఏడు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. జీకే వీధి, ధారకొండ పరిసర ప్రాంతాల గిరిజన గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఏఈఈ వనుము ప్రభాకరరావు పర్యవేక్షణలో లైన్‌మన్‌లు విద్యుత్ తీగలపై పడిన వృక్షాన్ని తొలగించి, ఉదయం తొమ్మిది గంటలకు సరఫరాను పునరుద్ధరించారు.


గూడెంకొత్తవీధి: ఉధృతంగా ప్రవహిస్తున్న గొల్లపల్లి వాగు

ముంచంగిపుట్టులో...

ముంచంగిపుట్టు: మండల పరిధిలో సోమవారం గాలివాన కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా కురిసిన కుండపోత వర్షానికి 23 పంచాయతీల పరిధిలో వాగులు వంకలు, మత్స్యగెడ్డ పాయలు వరదనీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పలు చోట్ల పంట పొలాలు దెబ్బతిన్నాయి. భారీ ఈదురు గాలులకు వనుగుమ్మ పంచాయతీ వనస గ్రామంలో ఇంటిపై చింత చెట్టు పడింది. ఆ సమయంలో ఇల్లలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. చెట్టు పడడంతో మూడు ఇల్లులు దెబ్బతిన్నాయి. ఇంటిపై కప్పులతో పాటు ఇంట్లో ఉన్న సామగ్రి ధ్వంసమయ్యాయని బాధితులు కె.రొయిల, కె.దానుమోతి, మహోదేవ్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు కోరారు. సర్పంచ్ మిల్కి గ్రామాన్ని సందర్శించి బాధితులను పరామర్శించారు. అలాగే దారెల పంచాయతీ పెద్దపేట గ్రామంలో ఒక ఇల్లు దెబ్బతిన్నదని సర్పంచ్ పి.పాండురంగస్వామి తెలిపారు.

డుంబ్రిగుడలో...

డుంబ్రిగుడ: బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా మండలంలో ఐదు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించిపోయింది. అలాగే గెడ్డలు, వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. పంట పొలాలు నీట మునిగిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఆరు రోజులుగా ఏకధాటిగా రేయింబళ్లు తేడా లేకుండా వర్షాలు కురుస్తుండడంతో వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. గెడ్డ అవతల చాల గ్రామాల గిరిజనులు నిత్యావసర సరకులు కొనుగోలు చేయడానికి ఎక్కడికీ వెళ్లలేని దుస్థితి దాపురిస్తున్నదని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అలాగే భారీ వర్షాలకు వరి నాట్లు కొట్టుకుపోయాయని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆలస్యంగా నాట్లు వేసుకోండి: ఏడీఏ జాహ్నవి


పెదబరడలో పంట పొలాలను పరిశీలిస్తున్న ఏడీఏ జాహ్నవి

చింతపల్లి, జూలై 22: వర్షాలు కురుస్తుండడంతో గిరిజన రైతులు రెండు రోజులు ఆలస్యంగా వరి నాట్లు వేసుకోవాలని అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ (ఏడీఏ) కంటా జాహ్నవి అన్నారు. మండలంలోని పెదబరడ, గొందిపాకలు పంచాయతీల పరిధిలోని పంట పొలాలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గిరిజన రైతులతో ఆయన మాట్లాడుతూ బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావం వల్ల గిరిజన ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురిశాయన్నారు. ప్రస్తుతం పంట పొలాల్లో నీరు నిల్వ ఉన్నందున రైతులు వరి నాట్లు వేసుకోరాదన్నారు. కొంత మంది రైతులు పొలాల్లో వరి నాట్లు వేసుకుంటున్నారని, దీనివల్ల నాట్లు కుళ్లిపోయే ప్రమాదం ఉందని చెప్పారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తరువాత రెండు రోజులు ఆగి నాట్లు వేసుకోవడం మంచిదన్నారు. ప్రస్తుత వాతావరణం దుక్కి, దమ్ము చేసుకోవడానికి అనుకూలమన్నారు. రైతులు 15-21 రోజుల వయస్సు కలిగిన లేత నారు నాటుకోవాలని ఆమె సూచించారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచన మేరకు మాత్రమే పంటలకు ఎరువులు, క్రిమిసంహారక మందులు పెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లొద్దు

▸▸ టీడీపీ డివిజన్ నాయకుడు పాండురంగస్వామి


గిరిజన మత్స్యకారులతో మాట్లాడుతున్న టీడీపీ నేత పాండురంగస్వామి

ముంచంగిపుట్టు, జూలై 22: మత్స్యగెడ్డ వరదనీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నదని, గిరిజన మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని టీడీపీ డివిజన్ నేత, దారెల పంచాయతీ సర్పంచ్ పి.పాండురంగస్వామి సూచించారు. భారీ వర్షాల కారణంగా పంచాయతీ పరిధిలో నష్టపోయిన పెద్దపేట గ్రామ మత్స్యకారులతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. వారి సాదకబాధలను అడిగి తెలుసుకున్నారు. వరదనీటి ఉధృతికి బోట్లు కొట్టుకుపోయాయని సర్పంచ్ దృష్టికి వారు తీసుకువచ్చారు. ఆ విషయాన్ని జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ దృష్టికి ఫోన్‌లో తీసుకువెళ్లగా ఆయన స్పందించారు. వెంటనే కలెక్టర్ ఆదేశాలతో స్థానిక తహసీల్దార్ ఆ గ్రామానికి వెళ్లి, బాధిత మత్స్యకారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాండురంగస్వామి మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు భారీ పడుతున్నాయని, గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయని, నీటి ఉధృతి తగ్గే వరకూ చేపల వేటకు వెళ్లరాదని సూచించారు. అలాగే ఉన్నతాధికారులతో మాట్లాడి పరిహారం అందే విధంగా చూస్తానని బాధితులకు ఆయన హామీ ఇచ్చారు.

ముంపు ప్రాంతాల్లో ముమ్మరంగా సహాయక చర్యలు

... 5వ పేజీ తరువాయి

ఐటీడీఏ పీవో చైతన్యతో కలిసి ఆయన ట్రాక్టర్‌పై ప్రయాణించి కూనవరం ప్రాంతంలో శబరి నది ఉధృతిని, సహాయక చర్యలను పరిశీలించారు. ప్రజలను కలిసి సహాయక, పునరావాస చర్యలపై ఆరా తీశారు. చింతూరు సమీపంలోని శబరి నది ఒడ్డున నివాసాల్లో ఉన్న వారిని పలుకరించి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పోలవరం ముంపు బాధితులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ పంపిణీపై ఆరా తీశారు. అలాగే నిమ్మలగూడెం నుంచి మధ్యప్రదేశ్‌కు వెళ్లే రహదారిపై వరదనీటి ప్రవాహాన్ని పరిశీలించారు. అలాగే కూనవరం బస్టాండ్ సమీపంలో తాత్కాలిక నివాసాల్లో వున్న వారిని ఆయన పరామర్శించి, ఏర్పాట్లపై ఆయా తీశారు. వదర బాధితులందరికీ సహాయక చర్యలు అందాలని కలెక్టర్ ఆదేశించారు.

ఘనంగా శాకాంబరి మహోత్సవాలు

శాకాంబర్లుగా దర్శనమిచ్చిన దేవతామూర్తులు


శాకాంబర్లుగా భక్తులకు దర్శనమిస్తున్న రాజరాజేశ్వరి అమ్మవారు... శివపార్వతులు... వేంకటేశ్వరస్వామి

పాడేరు రూరల్, జూలై 22: జిల్లా కేంద్రం పాడేరులోని పురాతన శైవక్షేత్రంగా ప్రసిద్ధి చెందిన ఉమానీలకంఠేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం ఉమానీలకంఠేశ్వస్వామి వారి సమేత రాజరాజేశ్వరి అమ్మవారి శాకాంబరి మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలం నాయుడు పర్యవేక్షణలో కమిటీ ప్రతినిధులు శాకాంబరి మహోత్సవాల నిర్వహణకు భారీగా ఏర్పాట్లు చేశారు. రాజరాజేశ్వరి అమ్మవారు, ఆలయ ప్రాంగణంలో ఉన్న శివలింగం, పార్వతీపరమేశ్వరులుతో పాటు వివిధ దేవతా మూర్తులు శాకాంబరులుగా దర్శనమిచ్చారు. శాకాంబరి మహోత్సవం సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులకు కమిటీ ప్రతినిధులు ప్రసాదం పంపిణీ చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొని దైవదర్శనం చేసుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ప్రధాన అర్చకులు శ్రీరామంపంతులు ప్రత్యేక పూజలు, అభిషేకాలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కొట్టగుల్లి రామారావు, పలాసి బాలన్న, కె.పోతురాజు, ఎస్.కొండలరావు, శ్రీనివాస్‌కుమార్, ముకుందరావు, రాజుబాబు, వెంకటరత్నం, ఎస్.సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా నిలవండి

బియ్యం, పప్పులు, నూనెలను అందించండి
వంటపాత్రలు, పాలు, బాలామృతం ఇవ్వండి
పాము కాటు యాంటీవీనమ్‌ను సిద్ధంగా ఉంచండి
కమాండ్ కంట్రోల్ రూమ్ నంబర్లు ప్రజలకు చెప్పండి
టెలీకాన్ఫరెన్స్‌లో అధికారులకు కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశం

పాడేరు (చింతూరు), జూలై 22 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లాలోని వరద బాధితులకు అధికారులు అండగా నిలవాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ఆదేశించారు. వరద సహాయక చర్యలపై జిల్లా అధికారులతో సోమవారం సాయంత్రం చింతూరు ఐటీడీఏ కార్యాలయం నుంచి నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. చింతూరు డివిజన్‌లో ఇప్పటికే రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేసినందున ముంపునకు గురయ్యే గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ఎక్కడా ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్ నంబర్లు ప్రజలకు తెలియజేయాలన్నారు. నిధుల కొరత లేదని, అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. 13 వేల టార్పాలిన్లు పంపిణీ చేస్తున్నామన్నారు.

అలాగే 16 బోర్‌వెల్స్ మంజూరు చేయగా.. నాలుగు బోరువెల్స్ వేశారని, మిగిలినవి వేగంగా వేయాలన్నారు. పప్పులు, బియ్యం పంపిణీ చేయాలని, మంగళవారం పామాయిల్ వస్తోందన్నారు. అవసరమైన చోటుకు బోట్లు పంపించాలన్నారు. అన్ని మండలాల్లో సంపూర్ణంగా డీజిల్ ఉందని, ఎక్కడా దుర్వినియోగం జరగకూడదన్నారు. పునరావాస కేంద్రాలకు వచ్చే బాధితులు వంట పాత్రలు తెచ్చుకోక పోతే వాటిని సరఫరా చేయాలని, పాలు పంపిణీ చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పాలు, బాలామృతం పిల్లలకు సరఫరా చేయాలన్నారు. పునరావాస కేంద్రాలలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, ముందు జాగ్రత్త చర్యగా పాము కాట్ల నుంచి రక్షించేందుకు యాంటీవీనమ్ మందులను అందుబాటులో ఉంచాలన్నారు. విద్యుత్ సరఫరాపై ప్రజలకు సమాచారం అందించాలని, ట్రాన్స్‌కో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తా

... 5వ పేజీ తరువాయి

చేయాల్సిన కృషి చేస్తానని, గిరిజన ప్రాంతంలో పనిచేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నారు.

చింతూరు ప్రాంతంలో వరద సహాయక చర్యలు ముమ్మరం

జిల్లాలో చింతూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో వరదల నేపథ్యంలో అక్కడ సహాయక చర్యలు ముమ్మరం చేసేందుకు తక్షణమే అక్కడికి వెళుతున్నట్టు నూతన జేసీ అభిషేక్ తెలిపారు. అక్కడ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపడతామని, రేషన్ సరకుల పంపిణీ, ఇతర సహాయక చర్యలు పక్కాగా ఉండేలా చూస్తామన్నారు. జిల్లాలో రెవెన్యూ, పౌరసర ఫరా సేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తానని, అందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తానన్నారు. అలాగే అర్హులకు రేషన్‌కార్డుల జారీ, ఇతర పథకాలను చేరువ చేసేందుకు కృషి చేస్తామన్నారు. వరదలు తగ్గుముఖం పట్టిన తర్వాత కలెక్టర్ సూచనలతో జిల్లాలో పర్యటించి సాధారణ కార్యక్రమాల్లో పాల్గొంటానన్నారు. జేసీగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ అభిషేక్‌కు డీఆర్‌వో పద్మావతి, రెవెన్యూ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

పెరుగుతున్న నీటి మట్టాలు

... 5వ పేజీ తరువాయి

వస్తుండడంతో ప్రస్తుతం ఇక్కడ 9.8190 టీఎంసీల నీటి నిల్వలు, బలిమెల జలాశయానికి 43,801 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. ఇక్కడ 20.6500 టీఎంసీల నీటి నిల్వలు, గుంటవాడకు 5 వేల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తుండడంతో ఇక్కడ 2.8820 టీఎంసీల నీటి నిల్వలు, డొంకరాయి జలాశయానికి 19,601 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో ప్రస్తుతం 10.2728 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. బలిమెలలో ఆంధ్రా వాటాగా 15.0331 టీఎంసీలు, డొంకరాయి, గుంటవాడ జలాశయాల్లో కలసి 13.1548 టీఎంసీలతో కలసి సీలేరు కాంప్లెక్సులో 28.1879 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి.

సీలేరులో విద్యుదుత్పత్తి : జెన్‌కో ఈఈ

ఈ సందర్భంగా జెన్‌కో ఈఈ ప్రభాకరరావు మాట్లాడుతూ గుంటవాడ జలాశయానికి ఆదివారం వరకు 8 వేలు క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో 1,355 అడుగులకు నీటి మట్టం శరవేగంగా పెరిగిందన్నారు. తర్వాత ఇన్‌ఫ్లో 5 వేల క్యూసెక్కులకు తగ్గడంతో సోమవారం సాయంత్రానికి 1357.30 అడుగులకు చేరిందన్నారు. సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో ఒక యూనిట్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందన్నారు. గుంటవాడ జలాశయానికి 1359.60 అడుగుల నీరు చేరిన మరుక్షణంలోనే దిగువకు నీటిని విడుదల చేసేలా తమ సిబ్బందిని 24 గంటలు అప్రమత్తం చేసి ఉంచామని ఈఈ ప్రభాకరరావు తెలిపారు.

గుంటవాడ జలాశయాన్ని పరిశీలించిన జెన్‌కో సీఈ

గరిష్ఠ స్థాయికి చేరువలో ఉన్న గుంటవాడ జలాశయాన్ని సీలేరు కాంప్లెక్సు చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ఈఈ ప్రభాకరావుని ఇన్‌ఫ్లో వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటిలోగా గరిష్ఠ స్థాయికి చేరుకునే అవకాశం అంశంపై ఆరా తీశారు. కార్యక్రమంలో పంప్డ్ స్టోరేజీ ఎస్ఈ చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.

జలాశయాల నీటి మట్టాల వివరాలు

జలాశయం పేరు	గరిష్ఠ స్థాయి నీటి మట్టం (అడుగుల్లో)	ప్రస్తుతం నీటి నిల్వ (అడుగుల్లో)
జోలాపుట్	2750	2710.40
బలిమెల	1516	1464.50
గుంటవాడ	1360	1357.30
డొంకరాయి	1037	1026.10
ఫోర్‌బై	930	918.20

☛ సంక్షిప్తంగా..

'ఐదేళ్లలో ప్రజాస్వామ్యం గుర్తుకు రాలేదా జగన్ సార్!?'

పాడేరు రూరల్, జూలై 22: ఒక్క ఛాన్స్ అంటూ ప్రజలను మభ్యపెట్టి పాలించిన వైసీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డికి గడచిన ఐదేళ్లలో ప్రజాస్వామ్యం అన్న పదం గుర్తు రాలేదా? అని తెలుగుదేశం పార్టీ విద్యార్థి విభాగం అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి వనుగు త్రినాథ్ ప్రశ్నించారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దళిత డ్రైవర్‌ను వైసీపీ ఎమ్మెల్సీ చంపి డోర్ డెలివరీ చేసినప్పుడు జగన్ సార్‌కు ప్రజాస్వామ్యం గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. డాక్టర్ సుధాకర్‌ను పిచ్చివాడిగా ముద్రవేసి చంపినపుడు, అటువంటి ఎన్నో ఘటనలను వైసీపీ నాయకులు బాహాటంగా చేసినపుడు ఎక్కడికి పోయింది ఈ ప్రజాసామ్యం అనే పదం అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో వైసీపీ చేసిన ప్రజా వ్యతిరేక పాలనకు ప్రజలు బుద్ధి చెప్పినా వైసీపీ నేతల తీరు మారకపోవడం విచారకరమన్నారు. దళితులపై దాడులు, వైసీపీ విధ్వంస పాలనను ప్రశ్నించిన ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులపై అక్రమ కేసులు పెట్టి వేధించిన ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు తీరు మార్చుకోవాలని ఆయన సూచించారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

పాడేరు రూరల్, జూలై 22: ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వనుము చిట్టబ్బాయి కోరారు. కళాశాలలో హెల్మెట్ వినియోగంపై సోమవారం విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వాహనంపై వెనుక కూర్చున్నవారు కూడా హెల్మెట్ ధరించడం ద్వారా రక్షణ పొందవచ్చన్నారు. 18 ఏళ్లు వారంతా డ్రైవింగ్ లైసెన్స్ చేయించుకోవాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ లేకుండా వాహనాలను నిర్లక్ష్యంగా నడిపి తమ ప్రాణాలకు ముప్పు తెచ్చుకోవడంతో పాటు ఎదుట వారి ప్రాణాలకు హాని కలిగించవద్దని సూచించారు. ఐక్యూ కో-ఆర్డినేటర్ పి.కోటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ పీవోలు వి.రమేష్‌బాబు, జి.గౌరీశంకరరావు హెల్మెట్ వినియోగం వల్ల లాభాలను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ధామోదర్, గణేష్, భాస్కర్, శంకరరావు, గోవిందరాజు, సౌజన్య, నిర్మల, సుమిత్ర, జానకిరామ్, అచ్యుత్ పాల్గొన్నారు.

వైసీపీ నిర్లక్ష్యంతోనే అసంపూర్తిగా వంతెనల నిర్మాణం

▸▸ టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు

పాడేరు రూరల్, జూలై 22: వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే మన్యంలో చాలా చోట్ల వంతెనల నిర్మాణం జరగలేదని, ప్రారంభించిన చోట్ల అసంపూర్తిగా నిలిచిపోయాయని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు ఆరోపించారు. తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు ముంపుకు గురైన ప్రాంతాల్లో సోమవారం పర్యటించారు. భారీ వర్షాలకు కోతకుగురైన రాయిగెడ్డ సమీప మత్స్యగెడ్డ వంతెనతో పాటు పలు ప్రాంతాల్లో నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయిగెడ్డ వద్ద మత్స్యగెడ్డ కాజ్‌వేపై నిర్మించాల్సిన పనులు నేటికి చేపట్టలేదన్నారు. ఫలితంగా నేడు ఆ మార్గంలో ప్రయాణం చేసే మూడు పంచాయతీలకు చెందిన వివిధ గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. పంట నష్టంపై అధికారులకు రైతులు ఫిర్యాదు చేయాలని సూచించారు. పంటలు దెబ్బతిన్న రైతులకు అధికారులు అండగా ఉండాలని కోరారు. ఈ పర్యటనలో టీడీపీ నాయకులు బి.మణికంఠరాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాజంగి జలాశయంలో పెరిగిన నీటి మట్టం

చింతపల్లి, జూలై 22: మండలంలోని తాజంగి జలాశయంలో నీటి మట్టం పెరిగిందని తహసీల్దార్ టి.రామకృష్ణ తెలిపారు. తాజంగి పంచాయతీలో సోమవారం పర్యటించిన ఆయన జలాశయం, కుడి, ఎడమ కాలువాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడు రోజులుగా కురిసిన వర్షాలకు ఎగువ నుంచి వర్షపు నీరు జలాశయానికి చేరుకున్నదన్నారు. దీంతో జలాశయం నిండు కుండను తలపిస్తున్నదన్నారు. జలాశయం దిగువనున్న పంట పొలాల్లో చెప్పుకోదగిన పంట నష్టం లేదని ఆయన చెప్పారు.

హెల్త్ అసిస్టెంట్లను నియమించాలి

ముంచంగిపుట్టు, జూలై 22: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల వసతి గృహాల్లో హెల్త్ అసిస్టెంట్లను నియమించాలని గిరిజన సంఘం జిల్లా నాయకులు కె.త్రినాథ్, ఎం.ఎం.శ్రీను డిమాడ్‌చేశారు. వివిధ వ్యాధులతో వైద్య సేవలు పొందేందుకు సోమవారం సీహెచ్‌సీకి వచ్చిన విద్యార్థులతో వారు మాట్లాడారు. హెల్త్ అసిస్టెంట్లు వసతిగృహాల్లో అందుబాటులో లేకపోవడం వల్ల విద్యార్థులు పడుతున్న ఇబ్బందులకు అడిగి తెలుసుకున్నారు. వైసీపీ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయంతో ఆశ్రమ పాఠశాల్లో హెల్త్ అసిస్టెంట్లను తొలగించిందన్నారు. దీంతో విద్యార్థులకు సకాలంలో వైద్య సేవలు అందక పలువురు మృతి చెందగా, వందల సంఖ్యలో మంచం పట్టాల్సిన దుస్థితి దాపురించిందని వాపోయారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి స్పందించి ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ అసిస్టెంట్లను నియమించాలని కోరారు.

నేటి నుంచి ఆధార్ శిబిరాలు

డుంబ్రిగుడ, జూలై 22: మండలంలో ఆధార్ శిబిరాలను మంగళవారం నుంచి ఏర్పాటు చేస్తామని ఎంపీడీవో జయ ఉమా తెలిపారు. సోమవారం విలేకరుతో ఆమె మాట్లాడుతూ ఆధార్ కార్డులో చిన్నారుల చిరునామాతో పాటు సమగ్ర వివరాలు నమోదుకు క్షేత్ర స్థాయిలో సచివాలయ సిబ్బందితో సర్వే చేపట్టడం జరిగిందని చెప్పారు. పదేళ్ల లోపు చిన్నారుల ఆధార్‌తో పాటు అపై కూడా ఆధార్ సమగ్రంగా ఆన్‌లైన్ చేసుకోవడానికి వీలు కల్పించామన్నారు. అరమ, గేదలబంద, అరకు, గుటసీమ, గన్నెల గ్రామాల్లో ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేస్తామని ఆమె తెలిపారు.

ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలి: ఎంపీపీ

చింతపల్లి, జూలై 22: క్షేత్ర స్థాయి ఉద్యోగులు, వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీపీ కోరాబు అనుషదేవి సూచించారు. సోమవారం ఎస్ఎంఐ ఏఈఈ లోకేశ్‌తో కలిసి తాజంగి జలాశయం దిగువ పంట పొలాలు, వాగులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయన్నారు. గ్రామాల్లో ఆస్తి నష్టం జరిగితే వెంటనే వీఆర్వో, కార్యదర్శులు మండల కేంద్రానికి తెలియజేయాలన్నారు. ఆస్పత్రుల్లో వైద్య సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. గిరిజనులు వ్యాధి సోకిన వెంటనే ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందాలని ఆమె చెప్పారు.